

విజన్- 2047 డాక్యుమెంట్‌లో

భాగస్వాములవ్వాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ మిషన్-2047 అంశాలతో డాక్యుమెంట్‌ను రూపొందిస్తుందని, ఈ సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకనుగుణంగా రూపొందిస్తున్న డాక్యుమెంట్ తయారీలో ప్రతీఒక్కరు భాగస్వామ్యమయ్యేలా ఈ నెల 10న సిటిజెన్ సర్వే ప్రారంభమైందన్నారు. ఈ నెల 25 వరకు జరిగే సర్వేలో ప్రజలు, ఎన్నారైలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, ఉద్యోగులు కూడా పాల్గొని విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హరీశ్‌గౌడ్



కందుకూరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కటికపల్లి గ్రామానికి చెందిన హరీష్ గౌడ్ రాష్ట్రస్థాయి అండర్ -14 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న హరీష్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ -14 పోటీల్లో మంగళవారం, బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చాడు. దీంతో అతను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 16, 17, 18 తేదిల్లో సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని కోచ్ కిరణ్ హరీష్ గౌడ్ తెలిపారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. గతేడాది జిల్లాలో పదవ తరగతి ఫలితాలు నిరాశను మిగల్చడంతో ఈ సారి ముందస్తుగా అప్రమత్తమైంది. నవంబరు నుంచే విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రతీ విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ఖర్చు చేసేందుకు బడ్జెట్ కేటాయించింది.



చౌదరిగూడ పాఠశాలలో..

స్పెషల్ ఫోకస్!

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ
- త్వరలో విద్యార్థులకు అభ్యసన దీపికల పంపిణీ
- ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో సాయంత్రం అల్పాహారం!
- నవంబరు నుంచే అమలుకు ప్రతిపాదనలు
- ఇందుకోసం ఒక్కో స్టూడెంట్‌కు రోజుకు రూ.15 ఖర్చు
- జిల్లాలో మొత్తం 55వేల మంది విద్యార్థులు.. ప్రభుత్వ స్కూళ్లలో చదివేవారు 18,884 మంది

ఇబ్రహీంపట్నం / చౌదరిగూడ అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గత విద్యా సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యంత వెనుకబడిన జిల్లాను గాడిన పెట్టేందుకు విద్యాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. రాష్ట్రంలో అధిక శాతం పదో తరగతి విద్యార్థులున్న రంగారెడ్డిజిల్లాలో గత ఏడాది ఫలితాలు తీవ్ర నిరాశ పరిచాయి. టెన్త్ పరీక్షల్లో జిల్లాకు 31వ స్థానం దక్కడం జిల్లా విద్యాశాఖ అధికారులకు మింగుడుపడలేదు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా విద్యాశాఖ ఈసారి ఉత్తీర్ణతా శాతం పెరగడంతో పాటు రాష్ట్ర స్థాయిలో మెరుగైన స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో ఈ ఏడాది ఫలితాలు మెరుగుపరిచేందుకు చర్యలు మొదలు పెట్టింది. జిల్లాలో మొత్తం

మిగతా 10వ పేజీలో...

గత విద్యా సంవత్సరం ఫలితాలు

విద్యార్థులు	పాసైన వారు	శాతం
51671	45386	87.84

సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు



తరగతి గదిలో ప్రతీ రోజు బోధించిన పాఠ్యాంశాలలో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ప్రత్యేక తరగతుల్లో బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధిస్తాం. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

స్పందన, పదో తరగతి, కేజీబీవీ లాల్‌పహాడ్



లాల్‌పహాడ్ కేజీబీవీలో స్టడీ అవర్‌లో విద్యార్థులు

గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యులు



గాలికుంటుతో పాడిరైతులకు

ఆర్థిక నష్టాలు

- ఈ వ్యాధిని దేశంలో లేకుండా నిర్మూలించాలి
- పశువులకు టీకాలు వేయించాలి
- పశు సంవర్ధకశాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ గోపి

మంచాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'గాలికుంటు'తో పాడిరైతులు ఆర్థిక నష్టాలకు గురయ్యే అవకాశం ఉంటుందని, వ్యాధి నివారణకు పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని రాష్ట్ర సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి సూచించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధి జాపాలలో బుధవారం పాడిరైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... తెల్లని రంగులో ఉండే పాడిఆవులు, గేదెలకు వచ్చే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందిగా పేర్కొన్నారు. వ్యాధిసోకిన పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ఇది అంటువ్యాధి అని, చీలిన గిట్టల ద్వారా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుందన్నారు. తీవ్రజ్వరం రావడం, నోటి నుంచి చొంగకారడం, నోరు, కాలిగిట్టల్లో పుండ్లు ఏర్పడడం, పొదుగు వాపు, మేత తినకపోవడం తదితర లక్షణాలతో పాడిపశువులు బాధపడతాయన్నారు. ఈ వ్యాధిని దేశంలో ఎక్కడా లేకుండా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతియేటా రెండు మార్లు టీకా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 92 పశువైద్య బృందాలతో నెలరోజులపాటు టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్తసంచాలకులు డా.మధుసూదన్, సహాయసంచాలకులు డా.వసంతకుమారి, పశువైద్యాధికారులు డా.సుధ, డా.వనజకుమారి, డా.శ్రీరాంరెడ్డి, డా.ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు పదోన్నతి

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్



చేవెళ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి లభించింది. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా చేవెళ్ల ఆర్డీవోగా కె. చంద్రకళ పది నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే పదోన్నతి రావడంపై చేవెళ్ల డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారి దర్శనానికి అవస్థలు

- ఎల్లమ్మతల్లి ఆలయానికి వెళ్లాలంటే అష్టకష్టాలు
- వానొస్తే మోకాళ్ల లోతు నీటిలో నడక
- రోడ్డు ఏర్పాటు గురించి పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రావిర్యాల, సర్దార్‌నగర్ రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు (ఫైల్)



రావిర్యాల శ్రీసూర్యగిరి ఎల్లమ్మ ఆలయం

మహేశ్వరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మనుషులకు ఆపదొస్తే దేవుడికి మొక్కుతారు. దేవాలయాలకు వెళ్లి సమస్యలు తీరిపోవాలని కోరుకుంటారు. కానీ తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల శ్రీసూర్యగిరి ఎల్లమ్మ అమ్మవారికి ఆపదొస్తే ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షం పడితే చాలు ఆలయానికి వెళ్లే రోడ్డుపై రాకపోకలు ఆగిపోవాల్సిందే. తుక్కుగూడ మున్సిపాలిటీలోని సర్దార్‌నగర్ నుంచి రావిర్యాలకు వెళ్లే ప్రధాన రహదారి వర్షం నీటితో చెరువును తలపిస్తోంది. రోడ్డు మార్గాన రెండు గ్రామాల ప్రజలే కాకుండా ఎంతో ప్రాచీనకాలం నాటి శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం ఉంది. ఈ ఆలయానికి ప్రతీ మంగళవారం సుమారు 10 వేలకు పైగా భక్తులు ఆలయానికి వస్తుంటారు. వర్షాకాలంలో ఆలయానికి చేరుకోవాలంటే మోకాళ్ల లోతు నీటిలో నడవాల్సి వస్తుంది. ఆలయానికి వెళ్లడానికి ఇంకో మార్గం లేదు. కొందరు భక్తులు ట్రాక్టర్లు, కార్లు, ఆటోల ద్వారా ఆలయానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. సర్దార్‌నగర్ నుంచి రావిర్యాల వరకు రోడ్డు పనులు చేపట్టాలంటే రూ.10కోట్ల వ్యయం అవుతుందని సంబంధిత అధికారులు అంచనా వేశారు. కానీ కార్యరూపం దాల్చడం లేదు. ముఖ్యంగా సర్దార్‌నగర్, రావిర్యాల గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయంగా ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు ఉండడంతో ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తీర్చాలని భక్తులు కోరుతున్నారు.

రేపు జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మాణ్ ఆర్గనైజేషన్ (ఇన్ఫోసిస్)ల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక తెలిపారు. 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలలోపు ఉండి.. పదో తరగతి ఆపై విద్యార్హత కలిగిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అర్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆమె చెప్పారు.

అంగన్‌వాడీకి

కుళ్లిన గుడ్లు

సరఫరాపై గ్రామస్తుల ఆందోళన



కేశంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంటపల్లి అంగన్‌వాడీ సెంటర్‌కు కుళ్లిపోయిన కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు గుడ్లు ఇచ్చారు. గ్రామానికి చెందిన కృష్ణమ్మ గుడ్లు తీసుకుపోయి ఉడకబెట్టి పైపెచ్చులు తొలిగించి చూడగా లోపలి భాగం కుళ్లిపోయింది. అందులో నుంచి దుర్గంధం వచ్చిందని ఆమె తెలిపింది. గతంలో కూడా ఇలాంటివి సరఫరా చేశారని, కుళ్లిన గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, అధికారులు



సజావుగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయం నుంచి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ధాన్యం కొనుగోళ్లపై వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం ధాన్యం ఇక్కడకు తరలించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, గ్రెయిన్ క్యాలిబర్స్ సరిపడా సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకుని త్వరితగతిన ధాన్యం తూకం జరిగేలా చూడాలని రైసు మిల్లులకు ధాన్యం సరిపడా లారీలను అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రమాణాలకు లోబడి లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ చేస్తామన్నారు. డీఆర్డీవో శ్రీలత, డీఎస్‌వో సుజాత, పౌర సరఫరాల డీఎం హరీష్, జిల్లా వ్యవసాయాధికారి ఉష, జిల్లా కోఆపరేటివ్ అధికారి సుధాకర్, మార్కెటింగ్ ఏడీ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.2కోట్లు ఇవ్వాలి

అధికారులకు తేల్చి చెప్పిన తిమ్మాయిపల్లి రైతులు



సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇస్తేనే భూములిస్తామని మండల పరిధిలోని తిమ్మాయిపల్లి రెవెన్యూ రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలోని 9, 15 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను టీఎస్ఐఐసీ ద్వారా భూసేకరణ చేపట్టడానికి కందుకూరులో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలోని 9 సర్వే నెంబర్‌లో 350 ఎకరాలు, 15 సర్వే నెంబర్‌లో 40ఎకరాల ప్రభుత్వ భూమిని టీఎస్ఐఐసీ ద్వారా సేకరించాలని నిర్ణయించారు. సాగులో ఉన్న రైతులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.55లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు అధికారులు వివరించారు. దీనికి ఒప్పుకోని రైతులు ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను కలెక్టర్ నారాయణరెడ్డికి నివేదిస్తానని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్ కుమార్, తహసీల్దార్ కె.గోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో సెర్ప్ సీఈవో పూజలు



రంగరాజన్‌తో దివ్య దేవరాజన్

మొయినాబాద్ రూరల్, అక్టోబరు15(ఆంధ్యజ్యోతి): మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయాన్ని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ దివ్య దేవరాజన్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్ స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం ఆమెకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ విశిష్టతను ఆమెకు వివరించారు. బాలాజీ దేవాలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్, జిల్లా దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు వడ్ల నర్సింహాచారి, మండల రెవెన్యూ అధికారి రాజేష్, భాస్కర్, జ్ఞానేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌ను పాత అలైన్‌మెంట్‌తోనే నిర్మించాలి



మాట్లాడుతున్న పగడాల యాదయ్య

షాద్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డును పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీనునాయక్ అధ్యక్షతన రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది ఎకరాల ఉన్న భూస్వాములను కాపాడుకునేందుకు, పేద, సన్న, చిన్నకారు రైతుల భూములను రీజినల్‌రింగ్ రోడ్డు పేరుతో ఆక్రమించుకునేందుకు, ప్రభుత్వ అలైన్‌మెంట్ మార్చిందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం కొమ్ము కాస్తుందన్నారు. నూతన అలైన్‌మెంట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎస్.రాజు, భూనిర్వాసితులు పూజారి లక్ష్మయ్య, రమేష్, చంద్రకాంత్, నాగేష్, సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్, మహ్మద్‌బాబు, కుర్మయ్య, ఈశ్వర్‌రాజు, బొజ్జనాయక్, రాజేష్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత



నాటిన మొక్కలు తొలగిస్తే కఠిన చర్యలు

డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

కొత్తూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈజీఎస్‌లో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలను తొలగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 8వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. మూడు రోజులుగా గ్రామాల్లో డీఆర్పీలు ఈజీఎస్‌పై సామాజిక తనిఖీలు నిర్వహించి నివేదికలను గ్రామాల వారీగా అధికారులకు వినిపించారు. ఈజీఎస్‌లో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలు దాదాపు 30 శాతానికి పైగా చనిపోయాయని, అక్కడక్కడ మొక్కలు తొలగించారని పేర్కొన్నారు. ఒకే ఇంటిలో ఇద్దరికి జాబ్‌కార్డులు ఉన్నాయని వివరించారు. పనులు చేయకున్న రికార్డుల్లో మాత్రం డబ్బులు అందజేసినట్లు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రజలు వారి అవసరాల కోసం రోడ్డు పక్కన నాటిన మొక్కలను తీసివేయడం సరికాదన్నారు. మొక్కలు తీసివేసే వారిపై భారీగా జరిమానాలు విధిస్తామన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత గ్రామ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. సామాజిక తనిఖీలో వచ్చిన పలు అంశాలపై విచారణ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు పీడీ సుభాషిణి, అబ్జర్వర్ సునీత, జేసీవో సునీత, స్థానిక ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మీ, సూపరింటెండెంట్ అలీ, ఏఈవో కొండయ్య, తరుణ్‌గౌతమ్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటుకు కృషిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామ మండలం మేకగూడ-జేపీదర్గా రోడ్డు వరకు హెచ్ఎండీఏ నిధులు రూ.70లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి నాయకులతో కలసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. చంద్రాయన్‌గూడలో 15లక్షలతో నిర్మిస్తున్న మహిళా భవనం, రంగాపూర్‌లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, గోవర్ధన్‌గౌడ్, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, పాండురంగారెడ్డి, విగ్నేశ్వర్‌రెడ్డి, బండారి రాజు, రాజునాయక్, గబ్రు చౌహాన్, రవీందర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, సత్తయ్య, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, శేఖర్, శ్రీశైలం, శివ, రామస్వామి, రాజేందర్, శేఖర్‌గౌడ్, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.


మేకగూడలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

డీసీసీ అధ్యక్ష పదవికి రఘువీరారెడ్డి దరఖాస్తు



ధారూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):అంతారం గ్రామానికి చెందిన పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి బుధవారం వికారాబాద్ డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన వికారాబాద్‌లో ఏఐసీసీ పరిశీలకుడు సూరత్‌సింగ్ ఠాకూర్‌కు దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని దరఖాస్తు చేసినట్లు చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేశానని, మరోసారి అవకాశమిస్తే జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి..



వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ డీసీసీ అధ్యక్ష పదవికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. వికారాబాద్ ఎన్నెపల్లిలోని ఛాయా బాంక్వెట్ హాల్‌లో ఏఐసీసీ అబ్జర్వర్ సూరజ్‌సింగ్ ఠాకూర్‌కు దరఖాస్తు ఇచ్చారు. కార్యక్రమంలో అబ్జర్వర్లు బెల్లయ్యనాయక్, వేణుగౌడ్ పాల్గొన్నారు. వికారాబాద్, ధారూరు మండలాల నాయకులు తమ అభిప్రాయాలు తెలిపారు.


మంత్రికి వినతిప్రతం ఇస్తున్న అంజయ్య, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కోట్‌పల్లి యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకోండి

● మంత్రి తుమ్మలను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మార్కెట్ కమిటీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పనుల విషయంలో బుధవారం వ్యవసాయ, మార్కెటింగ్‌ల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్యతో కలిసి విన్నవించారు. మార్కెట్ కమిటీలను అభివృద్ధి చేసి రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని వారు వినతి పత్రంలో కోరారు. దీంతో స్పందించిన మంత్రి.. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

18న బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి


బంద్‌ను విజయవంతం చేయాలని నినదిస్తున్న బీసీ సంఘాల నాయకులు

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీన తలపెట్టిన బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లైబ్రేరియన్స్ చైర్మన్ జి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం క్లబ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీసీ సంఘాల నాయకుల సమావేశంలో మాట్లాడారు. బీసీ హక్కుల కోసం చేపట్టిన ఈ బంద్‌లో అన్ని కుల సంఘాలు పాల్గొని బంద్‌ను దిగ్విజయం చేయాలని కోరారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరియాదవ్ మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకులు బంద్ విజయానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, శేఖర్, అంజయ్య, శంకర్, శివరాజు, రాజశేఖర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, రాములుగౌడ్, మారుతి, కోడి లక్ష్మణ్, ఎల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పనిచేసేవారికే పదవులు


సమావేశంలో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

● పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపునిచ్చి, అలాంటి వారికి పదవులు కల్పిస్తామని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. శ్రీశైలం బోర్డు సభ్యుడిగా ఎంపికైన సిల్వేరు కాశీనాథ్ బుధవారం షాద్‌నగర్ వచ్చి, వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పద్మశాలి భవనాన్ని సందర్శించిన కాశీనాథ్‌ను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన నర్సింహులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలంగాణ టీడీపీ నాయకులకు సైతం ఆంధ్రప్రదేశ్ ఆలయాల్లో పదవులిస్తున్నారని గుర్తుచేశారు. పనిచేసే వారికి పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నన్నూరు నర్సిరెడ్డిని టీటీడీ బోర్డు మెంబరుగా, సిల్వేరు కాశీనాథ్‌ను శ్రీశైలం ఆయన బోర్డు సభ్యుడుగా, శ్రీపతి సతీష్‌ను కాణిపాకం ఆలయ సభ్యుడిగా నియమించారని గుర్తుచేశారు. ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆలయాల్లో పరిశుభ్రతను, పవిత్రతను కాపాడుతూ, భక్తులకు సౌకర్యాలను పెంచడానికి కృషిచేయాలని కోరారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని కాశీనాథ్ అన్నారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు కోట దాస కృష్ణయ్య, వగ్గు కిశోర్, చిన్న బాల్‌రాజ్, బాస రజేందర్, పాలాది శివ, దాస రమేష్, రాములు, వర్కాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి


ఈదులపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నందిగామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ సౌజన్య అన్నారు. గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పలువురు రైతులకు కేఎన్ఎం-1638 రకానికి చెందిన చిరుసంచుల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే వేసిన ఈ రకానికి చెందిన పంటలను నందిగామ మండలంలోని ఈదులపల్లి, వీర్లపల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో సౌజన్య, మండల వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. పైరు పెరుగుదల, పంట రక్షణతో పాటు రైతుల అనుభవాలను అడిగి తెలుసుకొని వారికి తగిన సాంకేతిక సూచనలిచ్చారు. కార్యక్రమంలో అధికారులు రామశివరాం, శిరీష, రవీందర్, రవి పాల్గొన్నారు.

బలపడుతున్న బీసీల ఐక్యత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

షాద్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఐక్యత రోజురోజుకూ బలపడుతూ స్ఫూర్తిమంతంగా నిలుస్తోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మూడేళ్ల తర్వాత రాష్ట్రంలో బీసీలు అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తూ.. షాద్‌నగర్ బైపాస్ రోడ్డు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే కాలంలో బీసీల చైతన్యమే రాజ్యాధికారాన్ని నిర్ణయిస్తుందని తెలిపారు. జెండాలు మోయడమే కాదు.. ఎజెండాలు కూడా మాకు తెలుసన్నారు. భవిష్యత్తులో బీసీలే రాజ్యమేలుతారన్నారు. తమ పార్టీ బడుగు బలహీనవర్గాల పక్షాన నిలుస్తుందన్నారు. బీసీ మహాసభ నాయకులు శ్రీధర్‌వర్మ, గిరి, నర్సింహులు, ప్రదీప్, యాదయ్య, వేణుగోపాల్, పాల్గొన్నారు.

హోంగార్డుకు ఉత్కృష్ట సేవా పతకం


డీజీపీ నుంచి పతకాన్ని అందుకుంటున్న హోంగార్డ్ కృష్ణ

యాచారం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించే ఉత్కృష్ట సేవాపతకాన్ని కుర్మిద్దకు చెందిన మూలి కృష్ణ మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అతడు 2008లో హోంగార్డుగా ఎంపికయ్యారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ విభాగంలో, 2010లో ఫలక్‌నుమాలో విధులు నిర్వహించారు. అనంతరం బదిలీ అయి 2010 నుంచి డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

75 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కులకచర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాంరెడ్డిపల్లిలో సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి 75క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు గ్రామంలో ఓ ఇంట్లో దాడులు చేయగా 75క్వింటాళ్ల రేషన్ సన్న బియ్యం పట్టుబడ్డాయి. పట్టుబడిన బియ్యాన్ని సీజ్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండలంలో మొదటిసారి పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యు) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొడంగల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 765,75 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు.

దుద్యాల్‌లో లఘు చిత్రం షూటింగ్

దుద్యాల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దుద్యాల్‌లో బుధవారం లఘు చిత్రం షూటింగ్ నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసేందుకు లగచర్ల గ్రామానికి చెందిన ఈర్లపల్లి రమేశ్ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మత్తు పదార్థాలను తీసుకునే యువకులకు పోలీసులు ఇచ్చే కౌన్సిలింగ్‌కు సంబంధించిన దృశ్యాలను స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో చిత్రీకరించారు. ఎస్సై యాదగిరి, పోలీసు సిబ్బంది సన్నివేశంలో నటించారు. ఈ సందర్భంగా చిత్రాన్ని నిర్మిస్తున్న రమేశ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది యువకులు మత్తుకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారనే విషయాన్ని లఘు చిత్రంలో పాట రూపంలో ప్రజల ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.


లఘు చిత్రం షూటింగ్‌లో ఎస్సై, పోలీసులు

సాంకేతికతతో మరింత అభివృద్ధి

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మేడ్చల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడంతో డిజిటలైజేషన్ వ్యవస్థను మరింత అభివృద్ధి పర్చొచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ గూగుల్ సంస్థతో డిజిటల్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై మాట్లాడారు. మల్లారెడ్డి విద్యాసంస్థల యాజమాన్యం ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు సాంకేతిక రంగంలో మంచి విద్యాబుద్ధులు నేర్పడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవటంతో పాటు ఏఐ ఆధారిత విద్యను అభ్యసించే వీలుంటుందన్నారు. సాంకేతిక రంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నందున విద్యార్థులకు ఈ రంగం పట్ల పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉందన్నారు. విద్యార్థులకు డాక్టర్ అబ్దుల్ కలాం ఆదర్శమన్నారు. విద్యార్థులను దేశానికి సేవలందించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో గూగుల్ సంస్థ ఇండియా హెడ్ ఎడ్యుకేషన్ అండ్ హెడ్ టెక్స్ వైభవ్‌కుమార్, దక్షిణ భారత హెడ్ సిద్ధార్థ్ దల్వాడి, మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ మల్లారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విద్యార్థులను ఉర్రూతలూగించిన మల్లారెడ్డి

కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి తన డ్యాన్స్‌తో ఉర్రూతలూగించారు. స్టేజిపై డ్యాన్స్ చేసి విద్యార్థుల్లో జోష్ నింపడంతో కేకలతో దద్దరిల్లింది. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):తాండూరు-హైదరాబాద్ రోడ్డులో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు త్వరలో పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఓ ఫంక్షన్ హాలులో పట్టణ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయల కోసం కలెక్టర్‌తో చర్చించామని, పనులు చేపడుతామని చెప్పారు. స్థలాలున్న అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. అనంతరం ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సిములు, ప్రభాకర్ గౌడ్, రజాక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాల, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



ఏవో రాజశేఖర్‌కు వినతి ప్రతం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ సభ్యుడు మాల చందు డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలల విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయ ఏవో రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ..రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు పై చదువులకు వెళ్లలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి చరణ్‌గౌడ్, వేణు, శ్రీశైలం, మీన, రుషిగౌడ్, శివ, ఇర్ఫాన్, విద్యార్థులు ఉన్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను నిలిపివేయాలి



అంతారంలో ఎర్రమట్టి తవ్వకాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

తాండూరు రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):అంతారం శివారులో అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలను చేపడుతున్నారని రైతులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఎర్రమట్టి తవ్వకాలు జరిపే భూమిలో పురుగు మందు డబ్బాలతో ఆవేదన వ్యక్తం చేశారు. తవ్వకాలు నిలిపకుంటే ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అక్రమంగా మట్టి తవ్వుతున్నా మైన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమై ప్రజావిశ్వాసం కోల్పోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గ్యారంటీలు, 420హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తకుంట తండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ల సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. అన్ని వర్గాలను మోసగించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్, మాజీ సర్పంచ్ శోభచందునాయక్, సుక్యమ్మలాలయ్య, ప్యాక్స్ వైస్‌చైర్మన్ సత్యం, జాన్యనాయక్, జైపాల్‌నాయక్, లాల్యానాయక్, బాలు, సైదులు, వెంకటయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో సత్యం, శివ, మహేందర్, రాంజా, భీమ్లా, గన్య, కాల్య ఉన్నారు.

ప్రతి వ్యక్తిలో స్వదేశీ భావన ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సతీష్‌కుమార్ జీ తదితరులు

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్వదేశీ భావన ప్రతీ వ్యక్తిలో నిర్మాణం కావాలని, దేశ అభివృద్ధికి స్వదేశీ ఉద్యమం బాట చూపుతుందని స్వదేశీ జాగరణ మంచ్ అఖిల భారతీయ సహ సంఘటన మంత్రి సతీష్‌కుమార్ జీ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా మంచ్ ఆధ్వర్యంలో బసంత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాగరణ మంచ్ మహోత్సవాన్ని నిర్వహించారు. సతీష్‌కుమార్‌జీ, డాక్టర్ సత్తు లింగమూర్తి మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థను బలోపేతానికి స్వదేశీ వస్తువుల వినియోగం పెంచాలని తెలిపారు. టెక్నాలజీ ఆధారంగా యువత ఇతరులకు ఉద్యోగాలను కల్పించేలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జనాభాయ్, డాక్టర్ నరేందర్‌రెడ్డి, రావులపల్లి శేఖర్‌రెడ్డి, జి.మహేశ్వర్, డి.సుధాకర్‌రెడ్డి, ప్రాంత కన్వీనర్ ఈశ్వర్, వీభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మహేందర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ సుజాత, కో-కన్వీనర్ శివశంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పట్టణంలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి జై

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం తాండూరులో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీజేఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యాచరణపై బీసీ, జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో 18న జరిగే బంద్‌ను విజయవంతానికి నిర్ణయించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ఆదిభట్ల/యాచారం. అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా, ప్రైవేటు ఏజెన్సీలు కార్మికుల పొట్ట కొడుతున్నాయని, ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. బుధవారం యాచారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కార్మికులతో సమావేశం అయ్యారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు అమలు చేయకుండా ఏజెన్సీలు భారీగా కోతలు విధించి వేతనాలిస్తున్నారని తెలిపారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

● 9 నెలల బకాయిలు చెల్లించే వరకు విధులకు హాజరు కాము

● నోడల్ అధికారి కార్యాలయం వద్ద అధ్యాపకుల నిరసన



ఇంటర్ విద్య నోడల్ అధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అతిథి అధ్యాపకులు

వికారాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తమకు గత తొమ్మిది నెలలుగా రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అతిథి అధ్యాపకులు బుధవారం జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి (డీఐఈవో) కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 47మంది అతిథి అధ్యాపకులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా తాము వేతనాలకు నోచుకోక కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు నెలల వేతనం రాలేదని, ఈ విద్యా సంవత్సరంలో ఐదు నెలలు అవుతున్నా ఇంకా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వేతనం వస్తుందనే భరోసాతో కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం దొరికిన చోటల్లా అప్పులు చేశామని, నెలలు గడుస్తున్నా చేసిన అప్పులు తీర్చేమార్గం లేక సమాజంలో అవమానాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే అధ్యాపకుల జీవితాల్లోనే వెలుగు లేకుండా పోయిందన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని వారు చెప్పారు. నెలనెలా వేతనాలు రాక, కొందరు తమ సేవలు రెన్యూవల్ కాక అతిథి అధ్యాపకుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఆవేదన అర్థం చేసుకుని వెంటనే తమ వేతన బకాయిలన్నీ విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తమకు రావాల్సిన మొత్తం వేతనాలు చెల్లించే వరకు తాము తమ విధులకు హాజరయ్యేది లేదని వారు స్పష్టం చేశారు.

ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

● డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చల్లా నర్సింహారెడ్డి, పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ఓటు చోరీకి అడ్డుకట్ట వేయకుంటే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని డీసీసీ అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సాగిస్తున్న పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా మాజీ మంత్రి రవీంద్రనాయక్‌తో కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఓటు చోరీ ద్వారానే బీజేపీ అధికారాన్ని సాగిస్తోందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఐదు కోట్ల మందితో సంతకాల సేకరణ చేపట్టిందని నర్సింహారెడ్డి తెలిపారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా చేపడుతున్న సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అనుకూల, బీజేపీ వ్యతిరేక ఓట్లను గుర్తించి పథకం ప్రకారం ఓటర్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వాటికి బాధ్యులను వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఓటు చోరీకి వ్యతిరేకంగా చేపడుతున్న సంతకాల సేకరణకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల అభివృద్ధిపై కేంద్రం వివక్ష చూపుతోందని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లును ఆమోదించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో హన్మనాయక్, జగన్ ఉన్నారు.

ఉత్తర్వులను ధిక్కరించి మరో భవనంలోకి ..

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును తరలించొద్దు

● కార్యాలయాన్నిప్రారంభిస్తే తీవ్ర పరిమాణాలు ..

● మేడ్చల్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి



శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి మరో భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తే సంబంధిత అధికారులు గానీ, నాయకులు గానీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఎ-బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. శామీర్‌పేటలో ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకు స్థలంలో పార్కింగ్ లేకుండా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న శామీర్‌పేట మండల పరిషత్‌లోకి తరలించేందుకు గత నెల 15న ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, 23న మేడ్చల్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే కొందరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అధికారులు, కొందరు నాయకులు శామీర్‌పేట దర్గా సమీపంలో నూతన భవనంలోకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అనువుగాని చోట్ల ఆఫీసు ఏర్పాటు ఎంత వరకు సమంజసమని ఆయన ధ్వజమెత్తారు. ఇలా చేస్తే కాంగ్రెస్ నాయకులను గానీ, ఇతర పార్టీల నాయకులను గానీ సహించేది లేదన్నారు. వారిపై లోకాయుక్తలో కేసులు పెడతానని హెచ్చరించారు. రెవెన్యూ మంత్రికి సైతం ఈ విషయమై వివరించానని తెలిపారు. అధికారులు పునరాలోచించాలని, అదనపు కలెక్టర్ రాధికాగుప్తాను ఈ విషయమై కలిశానని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు కాదని మరో భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు ఉత్తర్వులు రాలేదని తెలిపారు. దర్గా వద్ద దాతల సహాయంతో నిర్మించిన భవనానికి ప్రభుత్వ అనుమతులు లేవని, అక్రమంగా కట్టిన భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎలా తరలిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో, అన్ని సౌకర్యాలు ఉండే పాత మండల పరిషత్‌లోనే కార్యాలయంలోనే రిజిస్ట్రార్ ఆఫీసును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, నాయకులు తుంకి బిక్షపతి, కమటం కృష్ణారెడ్డి, ఎల్ల మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, శంషాబాద్ మాజీ జడ్పీటీసీ బుర్కుంట సతీశ్, మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు అన్నారు. బుధవారం చౌదరిగూడ, సుల్తాన్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్,గౌస్ పాషా, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన కటికెల చింటు, కొమ్ము కిరణ్‌లు బీఆర్ఎస్‌లో చేరారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్యార పాండు, కార్మికులు

ఆమనగల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు అన్నారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండల పరిషత్ ఆవరణలో బుధవారం పంచాయతీ ఉద్యోగు, కార్మికుల సమావేశం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య అధ్యక్షతన నిర్వహించారు. పాండు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత హాజరయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో మహబుబాబాద్ జిల్లా గార్లలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల రాష్ట్ర మహాసభల విజయవంతంపై చర్చించారు. మహాసభల కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. మహాసభలకు కార్మికులు తరలి రావాలని పాండు పిలుపునిచ్చారు. సంఘటితం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, పాండు, పర్వతాలు, ఆశీర్వాదం, కుమార్, దోలి, జంగయ్య పాల్గొన్నారు.

కరీంపూర్ వాసులకు వరాల జల్లు

● ప్రకటించిన కరీంపూర్ మాజీ సర్పంచ్ సుందరి అనిల్



కోట్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కోట్‌పల్లి మండలం కరీంపూర్ గ్రామ ప్రజలకు ఆ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ వరాలు ప్రకటించారు.గ్రామ ప్రజల కోసం స్వచ్ఛందంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానని తెలిపారు. తాను అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాల గురించి బుధవారం వివరించారు. గ్రామంలోని ప్రతి ఆడపిల్ల వివాహానికి తాను రూ.1,05,116 సాయం చేస్తానని చెప్పారు. యువకుడి పెళ్లికి రూ.55,116 ఇస్తానన్నారు. కరీంపూర్ వాసుల వివాహం, నిశ్చితార్థం, పుట్టిన రోజు వేడుకల వంటి శుభ కార్యక్రమాలకు తన ఫంక్షన్‌హాల్‌ను ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. గ్రామంలో ఎవరు మరణించినా దహన సంస్కారాలకు రూ.11వేలు అందజేస్తానన్నారు. ప్రజల్లో ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఆపరేషన్ చేసుకుంటే తనవంతు సాయంగా రూ.15వేలు ఇస్తానని చెప్పారు. రంజాన్ సమయంలో ప్రజలకు ఇఫ్తార్ విందు, మొహరం సందర్భంగా అన్నదానం చేస్తానని తెలిపారు. గ్రామంలో ఎవరు సొంత ఇల్లు నిర్మించుకున్నా స్లాబ్ వేసుకునే సమయంలో రూ.21వేల ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాలన్నీ రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామస్తులందరికీ వర్తింపజేస్తామని స్పష్టం చేశారు.

చిట్టినాడ్ రైల్వేలైన్‌తో రైతులకు నష్టం



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి రాసిన లేఖ

తాండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగెంకలాన్‌లో చిట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వే లైన్‌తో ఏర్పడిన వరద సమస్యలకు తక్షణం పరిహారం ఇవ్వాలని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సిమెంట్ ఎండీకు లేఖ రాశారు. 2015లో నిర్మించిన రైల్వేలైన్ 15కి.మీ విస్తీర ణంలో ఉందని, ఇది సమీప గ్రామాలు, పంట భూముల్లో తీవ్రమైన వరద సమస్యలను సృష్టించిందన్నారు. ఈ లైన్ కట్ట వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తోందని పేర్కొన్నారు. 150 ఇళ్లు, 200ఎకరాల భూమికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. రైల్వేలైన్ అసలు డిజైన్‌లో 18 పిల్లర్లు ఉంటే కేవలం 3 స్తంభాలతో కల్వర్టులతో నిర్మించారని తెలిపారు. దీంతో వాన నీరు వెళ్లలేక ఇళ్లు, పొలాలు మునుగుతున్నాయని లేఖలో తెలిపారు. నివాసితులకు, రైతులకు వెంటనే న్యాయం చేయాలని లేఖలో డిమాండ్ చేశారు.

ఇళ్లు కోల్పోతున్న వారితో కలెక్టర్ సమావేశం



కొడంగల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారితో బుధవారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా 8వేల గజాల్లో భూ సేకరణకు సంబంధించి ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలతో మాట్లాడారు. భూమి విలువ, ఇళ్ల విలువను బట్టి పరిహారం ఇస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి నిర్వాసితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంగీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేవంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్ఓ మంగీలాల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఈవో రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాంబాబు, జి-సెక్షన్ సూపరిండెంట్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి



నిరసన తెలుపుతున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు

శంషాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య అన్నారు. బీసీ రిజర్వేషన్ కల్పించాలని బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన సమితి నిర్వహించిన ఆందోళనకు హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో బీసీ జనాభా 62శాతం ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిందన్నారు. దీన్ని అడ్డుకుంటున్న అగ్రకులాల చర్యలను తిప్పికొట్టేందుకు ఈ నెల 18న ధర్నా, రాస్తారోకోలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, జంగయ్య, ప్రభులింగం, యాదగిరి, ఆనంద్‌గౌడ్, గిరి, మంజుల, సత్తిరెడ్డి, చంద్రయ్య, రాములు, శంకరయ్య, సురేందర్ పాల్గొన్నారు.

భూసేకరణ చేపట్టొద్దు

ఆదిభట్ల/యాచారం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):యాచారం మండలం మొండిగౌరెల్లిలో సర్వే నంబర్లు 19, 68, 127లలో భూసేకరణ చేయొద్దని రైతులు బుధవారం ఎమ్మార్వో అయ్యప్పకు వినతిపత్రమందించారు. భూములను నమ్ముకొని వందలాది మంది బతుకున్నట్లు రైతులు తెలిపారు. తమ బాధలు గమనించి భూసేకరణ నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రవి రైతులు పాల్గొన్నారు.

ల్యాండవుతుండగా విమానంపై పడిన లేజర్ లైట్స్

● ఏటీసీకి సమాచారం అందించిన పైలెట్

● అంతర్గత విచారణకు ఆదేశించి ఎయిర్ లైన్స్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి వస్తున్న ఓ విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా విమానంపై లేజర్ లైట్స్ పడడంతో పైలెట్ ఏటీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం రాత్రి 9.36 గంటలకు తిరుపతి నుంచి వస్తున్న విమానం ఎయిర్‌పోర్టులోని రన్‌వేపై ల్యాండైంది. ఆ సమయంలో ఎయిర్‌పోర్టు బయట నుంచి లేజర్ లైట్స్ పడ్డాయి. పైలెట్ వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై ఎయిర్‌లైన్స్ అధికారులు అంతర్గత విచారణకు ఆదేశించారు. ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల లేజర్ షోలు నిర్వహించొద్దనే ఆంక్షలున్నా కొందరు లేజర్ షోలు నిర్వహిస్తున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటన జరగగా పోలీసులు కేసు నమోదు చేశారు. తాజా ఘటనపై ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎయిర్‌లైన్స్ నుంచి ఫిర్యాదు అందలేదని చెప్పారు.



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీవో వేజన్న, తదితరులు

మాడ్గుల ఎంపీడీవోగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

మాడ్గుల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వికరాబాద్ నుంచి మాడ్గుల మండల ఎంపీడీవోగా జి.విజయలక్ష్మి బదిలీపై వచ్చారు. బుధవారం కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న పద్మజ 8 నెలల క్రితం బదిలీపై కలెక్టరేట్‌కు వెళ్లారు. అప్పటినుంచి ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీవో వేజన్న విధులు నిర్వహించారు. ఈమేరకు ఎంపీవో వేజన్న, పీఆర్‌ఏఈ కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ సిబ్బంది విజయలక్ష్మిని శాలువాతో సన్మానించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



ఆర్థికసాయం అందిస్తున్న జెనిగల మహేశ్ యాదవ్

కడ్తాల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధైర్యపడవద్దు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ నాయకుడు జెనిగల మహేశ్ యాదవ్ అన్నారు. ఎక్వాయిపల్లిలో బుధవారం మహేశ్ పర్యటించి గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల మృతి చెందిన, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు.

తెలంగాణ యువత ప్రపంచంతో పోటీపడాలి

ఆమనగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల ద్వారా తెలంగాణ యువత ప్రపంచంతో పోటీ పడాలని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. టాస్క్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యువత, విద్యార్థులకు వివిధ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. హైదరాబాద్ టాస్క్ కార్యాలయంలో బుధవారం ప్రముఖ శిక్షణ సంస్థ 360 డీజీటీఎంజీ సహకారంతో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ఎంపిక పత్రాలను టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హాతో కలిసి సుంకిరెడ్డి అందజేశారు. ఆరు నెలల పాటు సంస్థ ద్వారా శిక్షణ పొందనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక ప్రముఖ కంపెనీలలో మంచి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి



ఆదిభట్ల : విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఆదిభట్ల/ఆదిభట్ల/యాచారం/మాడ్గుల : అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, ఆన్‌లైన్ గేమ్స్, లోన్‌లకు దూరంగా ఉండాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి సూచించారు. బుధవారం మంగల్‌పల్లిలోని సీవీఆర్ కాలేజీ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. డీసీపీ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలను కోల్పోవద్దని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై లక్ష్యాన్ని మరవద్దన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. కాలేజీల సమీపంలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు రామకృష్ణ, విద్యార్థులున్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గ్రీన్ ఫార్మా సిటీ సీఐ సత్యనారాయణ అన్నారు. మేడిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు ఆన్‌లైన్ గేమ్స్, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సైలు సైదుల, వంశీ తదితరులు న్నారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి ఉన్నత పాఠశాలలో రాచకొండ కమిషనరేట్‌కు పోలీసులు విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాచారం సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి బాలికలకు హితవు పలికారు. మండల కేంద్రంలోని బాలికల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ బాలికలకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మధు తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలంతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే శిశువు ఆరోగ్యవంతంగా(బలంగా) జన్మిస్తారని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. మండలంలోని రాచులూరు సెక్టార్‌లో గల అగర్‌మియాగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు శ్రీలత, వరలక్ష్మీ, టీచర్లు పాల్గొన్నారు.

కొత్తూరు : తల్లిదండ్రులు బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో ఉదయ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సూపర్‌వైజర్ రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణమాసంలో ఉదయతో పాటు, పలువురు అధికారులు పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలు, బాలబాలికలకు పౌష్టికాహారంపై అధికారులు అవగాహన కల్పించారు. అన్నప్రాసన, పౌష్టికాహారం తయారుచేసి ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసి వివరించారు. మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో అంగోర్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, లక్ష్మీబాయి, సుదర్శన్‌గౌడ్, టీచర్లు, ఆశాలున్నారు.

కొందుర్గు : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జోత్స్న తెలిపారు. ముట్పూర్ రైతువేదిక ఆవరణలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, మాదవి, వినోద శారద, భారతి, సంగీతలు పాల్గొన్నారు.

మాడ్గుల : తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ అరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ సూచించారు. మాడ్గుల మండల కేంద్రంలోని జయప్రకాశ్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.

స్పెషల్ ఫోకస్!

(ఏడో పేజీ తరువాయి)

55వేల మంది విద్యార్థులు ఉండగా, ప్రభుత్వ స్కూళ్లలో చదివేవారు 18,884 మంది ఉన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూనే మంచి ఫలితాల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పూర్తి స్థాయి సన్నద్ధం చేస్తోంది. ఇందుకోసం ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. సకాలంలో సిలబస్ పూర్తిచేసి ఆ వెంటనే రివిజన్ ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులకు అర్థం కానీ పాఠ్యాంశాలను నివృత్తి చేస్తున్నారు. నిత్యం పాఠశాల సమయం పూర్తయిన తర్వాత సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు గంట పాటు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలని దాదాపు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి పంపింది. నవంబరు మొదటి వారంలో వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రతీ విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ఖర్చు చేసేందుకు బడ్జెట్ కేటాయించింది. దీనిద్వారా పోషక విలువలు ఉండే పదార్థాలను విద్యార్థులకు అందించనున్నారు. గతంలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఫిబ్రవరి నెల నుంచి సాయంత్రం అల్పాహారం అందచేసే వారు. కానీ ఈసారి నవంబర్ ఆరంభం నుంచే అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలాఉంటే మెరుగైన ఫలితాల సాధన కోసం టీజీఎస్‌ఈఆర్టీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించిన అభ్యసన దీపికలను పార్ట్-2 పాఠ్య పుస్తకాలతో పాటు విద్యార్థులకు అందించేలా విద్యా శాఖ చర్యలు చేపట్టింది.

గత ఏడాది ఫలితాలు ఇలా...

గత ఏడాది జిల్లా పరిషత్ హైస్కూళ్లలో 71.65శాతం మాత్రమే టెన్త్ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ప్రభుత్వ స్కూళ్లలో 65.31 శాతం, మోడల్ స్కూళ్లలో 84.80 శాతం, కేజీబీవీలో 75 శాతం, ఎయిడెడ్‌లో 87.18 శాతం, ఆశ్రమ పాఠశాలలో 76.60 శాతం, బీసీ సంక్షేమ పాఠశాలల్లో 95.24 శాతం, మైనారిటీ రెసిడెన్షియల్‌లో 91.87 శాతం, సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల్లో 94.97శాతం రాగా, గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో 93.68శాతం ఉత్తీర్ణత లభించింది.

వెనుకబడిన అంశాల్లో ప్రత్యేకంగా..

పదో తరగతి విద్యార్థులకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అదించడంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4:15 నుంచి 5:15 గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. వీటిలో ఏ రోజు ఏ సబ్జెక్టుల వారిగా తరగతులు నిర్వహించాలనే విషయంపై స్పష్టమైన టైం టేబుల్‌ను ప్రభుత్వం తయారు చేసి పంపారు. ఉదయం ఒక ఉపాధ్యాయుడు, సాయంత్రం మరో ఉపాధ్యాయుడు వారికి సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఏ.బీ.సీ గ్రూపులగా విభజించి సులువుగా పాఠ్యంశాలు అర్థమయ్యేలా విద్య బోధిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. స్లిప్ టెస్టులు నిర్వహించడంతో పాటు విద్యార్థులు ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారనేది గుర్తించి అందుకనుగుణంగా బోధన చేయనున్నారు.

తప్పుల సవరణకు రోజువారి పరీక్షలు..

విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో చేసే తప్పులను గుర్తించేందుకు వారికి అవగాహన కల్పించేందుకు రోజువారి పరీక్షలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. సబ్జెక్ట్ వారీగా ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు చేసిన తప్పులను వ్యక్తిగతంగా వివరించి, మరోసారి పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. వారికి నిత్యం తెల్లవారు జామునే ఫోన్‌కాల్‌తో నిద్రలేపి విద్యార్థులు చదివేలా ప్రోత్సహిస్తు వారి ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా కూడా సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతున్నాయి.. సబ్జెక్టు ఉపాధ్యాయులు ఏ విధంగా చెబుతున్నారనే దానిపై పర్యవేక్షణ కొరవడింది. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల చదువులు, ఉపాధ్యాయుల బోధన తీరుపై పర్యవేక్షణ కొనసాగుతుండగా, మరికొన్ని బడుల్లో అది కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. రోజూ క్రమం తప్పకుండా చదివితే కానీ, పట్టు సాధించలేని గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గతేడాది ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఈ సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టుసాధించేలా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

చదువుకునేందుకు అవకాశం



ప్రత్యేక తరగతుల ద్వారా ఎక్కువగా చదువుకునేందుకు అవకాశం లభిస్తుంది. ఈ ఏడాది ముందుగానే ప్రత్యేక తరగతులు ప్రారంభించడంతో మంచి ఫలితాలు సాధించడానికి చాన్స్ ఉంది. సందేహాలుంటే ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

- వినయ్, టెన్త్, జెడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

గూడూర్‌లో వీధికుక్క స్వైరవిహారం

క్రైం కార్నర్

- ఆరుగురిపై దాడి.. తీవ్ర గాయాలు
- శునకాన్ని చంపిన గ్రామస్తులు

కొత్తూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో ఓ వీధికుక్క స్వైరవిహారం చేసి ఆరుగురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. అందులో ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నారు. కోపాద్రిక్తులైన గ్రామస్తులు పిచ్చికుక్కను మట్టుపెట్టారు. వారి కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి పిచ్చికుక్క గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడిచేసి గాయపరిచింది. ఇంటి బయట ఆడుకుంటున్న రిషి(12)ని పిచ్చి కుక్క దాడిచేసి ముఖంపై కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆనంతరం ఓ ఇంట్లోకి దూరి సరిత(12) అనే బాలికపై దాడి చేసి గాయపరిచింది. పిచ్చి కుక్కను అడ్డుకోబోయిన చందును సైతం దాడిచేసి గాయాలకు గురిచేసింది. అలాగే లక్ష్మయ్య, నర్సింహ, అజయ్‌లపైనా దాడి చేసి గాయపరిచింది. రిషిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలించగా.. వైద్యులు నోటి కింది భాగంలో ప్లాస్టిక్ సర్జరీ చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. పిచ్చికుక్క గ్రామంలో వీరంగం సృష్టిస్తుండడంతో కోపాద్రిక్తులైన గ్రామస్తులు కుక్కను కొట్టి చంపారు. గ్రామంలో వీధికుక్కల బెడద అధికమైందని, భయం నీడలో బతకాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

కొందుర్గు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కొందుర్గు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొందుర్గుకు చెందిన చిల్క యాదమ్మ(55) కొన్ని రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేది. కడుపులో కంతితో పాటు నొప్పి అధికం కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆమె ఏ విధంగా ఆత్మహత్యకు పాల్పడిందో నిర్ధారణకు రాలేదు. యాదమ్మ కూతురు బ్యాగరి సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. యువకుడి మృతి

శంకర్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని మియాఖాన్ గడ్డ వద్ద బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మోకిల పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంనకు చెందిన మణికంఠ(30) మియాఖాన్ గడ్డ వద్ద టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా శంకర్‌పల్లి వైపు నుంచి గండిపేట వైపు వస్తున్న సిమెంటు లారీ ఢీకొంది. లారీ చక్రాల కింద యువకుడు నలిగిపోయాడు. స్థానికులు లారీ డ్రైవర్ ముకుందరెడ్డిని పోలీసులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి డీసీఎం బోల్తా

కేశంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కోళ్ల దాణాతో వెళుతున్న డీసీఎం అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన కేశంపేట మండలం సంతాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. మెదక్ జిల్లా సూరారం నుంచి సంతాపూర్ గ్రామానికి చెందిన కోళ్లఫాం యజమానులు రాజ్‌రెడ్డి, అంజయ్యలకు సత్యరాజ్ అనే డ్రైవర్ డీసీఎంలో దాణా తీసుక వస్తున్నాడు. గ్రామ సమీపానికి రాగానే సంతాపూర్- రాయిచెడ్ మార్గంలో మూలమలుపు వద్ద డీసీఎం అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డు పక్కన చెట్లకు తాకి ఆగిపోయింది. కాగా, చెట్లు ఉండడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులోని ఎస్కలేటర్ పైనుంచి పడిన బాలుడికి తీవ్ర గాయాలు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని అరైవల్‌లో ఎస్కలేటర్ పైనుంచి పడి నాలుగేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. నగరానికి చెందిన కొందరు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బంధువులను రిసీవ్ చేసుకోవడానికి వచ్చారు. ఈక్రమంలో బాలుడు మహ్మద్ అబ్దుల్ సీ-లెవల్ ఎస్కలేటర్ నుంచి డీ-లెవల్ ఎస్కలేటర్‌పై పడడంతో కుడికాలికి గాయాలయ్యాయి. రక్ష సిబ్బంది ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్నారి తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రథమ చికిత్స అనంతరం నగరానికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

శంషాబాద్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మధుసూదన్ అనే వ్యక్తి పల్సర్ బైకుపై ఎయిర్‌పోర్టు నుంచి శంషాబాద్ వైపు వస్తుండగా డెకాత్లాన్ వద్ద అదే రూట్లో ప్రయాణిస్తున్న కారు వెనకల నుంచి బలంగా ఢీకొంది. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. జీఎంఆర్ రక్షా సిబ్బంది ఎయిర్‌పోర్టు అపోలో ఆస్పత్రికి తరలించారు. కాగా, కారు డ్రైవర్ రాహుల్ చౌదరి ర్యాష్‌డ్రైవింగ్‌తోనే ప్రమాదం జరిగిందని వాహనాదారులు తెలిపారు.

క్రిస్కో గ్రూపు యాజమాన్యంపై కేసు

శంకర్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రీలాంచ్ పేరిట విల్లాలు నిర్మిస్తామని మోసం చేసిన నిర్మాణ సంస్థ క్రిస్కో గ్రూపుపై శంకర్‌పల్లి పోలీసులు సెప్టెంబరు 10న కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపూర్ పరిధి సర్వేనెంబర్ 317పార్టు, 324 పార్టులో శ్యాంసుందర్, నర్సింహరావు, అనిల్‌కుమార్‌లు 11.10 ఎకరాల భూమిలో విల్లాల నిర్మాణం ప్రారంభించారు. పదేళ్లు పూర్తైనా విల్లాల నిర్మాణం పూర్తికాకపోవడంతో, కొనుగోలుచేసిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణదారులు 58మంది కొనుగోలుదారుల నుంచి రూ.14.36కోట్లు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును శంకర్‌పల్లి పోలీసులు ఇటీవల ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటాల వద్ద అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడని వారు కొనియాడారు.



ఆదిభట్ల : ప్రాథమిక పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆమనగల్లు : కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీఎస్ఎస్‌వో చీఫ్ లక్ష్మీనివాస్



కడ్తాల : బట్టర్‌ఫ్లై సిటీ స్కూల్లో నివాళులర్పిస్తున్న ఎండీ శేషగిరిరావు

చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించాలి



ఎమ్మెల్యే యాదయ్యకు సమస్యలు విన్నవిస్తున్న చిరువ్యాపారులు

చేవెళ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించేలా ప్రభుత్వం న్యాయం చేయాలని చేవెళ్లలోని చిరువ్యాపారులు కోరారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని చిరు వ్యాపారులందరూ భారీ సంఖ్యలో ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్యను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. చేవెళ్ల పోలీస్‌లు, మున్సిపల్ అధికారులు తమను బస్టాండ్ ప్రాంగణం నుంచి బలవంతంగా చేవెళ్ల రైతుబజార్‌కు తరలించారని, అక్కడ పండ్లు, పూలను కొనేవారు రాకపోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే చిరువ్యాపారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు, తదితరులు ఉన్నారు.



'ఉత్సాహంగా మాస్టర్ ఆరేటర్స్ కాంటెస్ట్'

ఆదిభట్లలోని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ఘనంగా మాస్టర్ ఆరేటర్స్ కాంటెస్ట్ నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏజీఎం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసి సమాజానికి గొప్ప ఉపన్యాసకులను అందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచానికి గొంతెత్తి మాట్లాడే విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కాంటెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కో-ఆర్డినేటర్ మోహన్, ప్రిన్సిపాల్ రెజిన, పీటర్‌సన్, నగేష్ గుప్త, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

- ఆదిభట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

శంకర్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చనిపోయిన మున్సిపల్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ డిమాండ్ చేశారు. అనారోగ్యంతో మృతిచెందిన మున్సిపల్ కార్మికుడు శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్మికులు రమేష్, రాములు, కృష్ణ, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

మొయినాబాద్‌లో నాకాబందీ

మొయినాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని తోలుకట్ట స్టేజీవద్ద, మొయినాబాద్‌లో హిమాయత్‌నగర్ చౌరస్తా, అజీత్‌నగర్ పాతస్టేజీ వద్ద, గండిపేట వైజంక్షన్, వీరన్నపేట్ స్టేజీ వద్ద తనిఖీలు చేపట్టారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు తనిఖీలు తరచుగా కొనసాగించడం జరుగుతుందని డీసీపీ చెప్పారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తాం

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించనున్నట్లు ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డుకు వచ్చిన మొక్కజొన్న రైతులను కలిసి మాట్లాడారు. డైరెక్టర్ కరుణాకర్, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్‌లు తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

చేవెళ్ల : సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, మండలంలోని ఊరెళ్ల, కమ్మెట తదితర గ్రామాల్లోని పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మహేశ్వరం : బీజేపీ మండల శాఖ ఆత్మీయ సమ్మేళనం నాగారం గ్రామంలోని కుండె వెంకటేష్ రిసార్ట్స్‌లో నేడు(గురువారం) నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు తెల్గమల్ల యాదీశ్ తెలిపారు. కార్యక్రమానికి ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మౌనిక సుంకరలు హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ మండల కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యక్షులుగా యాదగిరి, రూప్‌సింగ్, విద్యాసాగర్‌రెడ్డి, మమత, చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఉపేందర్, శ్రవణ్, కార్యదర్శులుగా అనిత, దేవేందర్, శ్రీనివాస్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరరీగా కాసాని ఆనంద్ గౌడ్, సభ్యులుగా మల్లేశ్, సురేందర్‌చారి, మంత్రి కరుణాకర్, బాల్‌రాజ్, రాజవర్ధన్‌రెడ్డి, దానయ్యలను నియమించి నియామక పత్రాలు అందజేశారు.

కందుకూరు : అబ్దుల్ కలాం జీవితం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఎవరెస్ట్-కలాం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని గూడూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకకు మహేంద్రకుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నేత్రాలయం వారిచే నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్, నోట్‌బుక్‌లు అందజేశారు. కలాం ఫౌండేషన్ జోన్ చైర్మన్ బుచ్చయ్య, సభ్యులు ఉన్నారు.

కొందుర్గు : మండల పరిధిలోని మహాదేవ్‌పూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు పి.రజితను శాలువాతో సన్మానించారు. గ్రామ యువకుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేశంపేట : కాకునూర్‌కు చెందిన సొంటె శ్రీనివాస్ మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు, ఎస్.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. అంకితభావం, నిబద్ధతతో సమాజసేవ చేసిన శ్రీనివాస్‌ను సన్మానించి పురస్కారం అందజేశారు.

కేశంపేట : బీఆర్‌ఎస్ నాయకుడు సాజిద్ ఉదారత చాటుకున్నాడు. వర్షాలకు సంతాపూర్-చౌలపల్లి రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. సాజిద్ బుధవారం రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించాడు. గుంతలు ఉన్న చోట మట్టిని పోయించారు. అలాగే జేసీబీతో చదును చేయించాడు. రోడ్డు పనులు చేయించడానికి దాదాపు రూ. 80వేలు ఖర్చు చేసినట్లు వివరించారు.

షాబాద్ : రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమౌతొందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాడుతామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. షాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 4వ రోజు రిలే నిరహార దీక్ష చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి నిమ్మరసం, అరటిపండ్లు ఇచ్చి దీక్షను విరమింపజేశాడు.

చేవెళ్ల : వర్షాల కారణంగా చేవెళ్ల నుంచి ఊరెళ్లకు వెళ్లే బీటీ రోడ్డు పక్కన ఉన్న రోడ్డు కాలువలుగా మారడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు, రజక సంఘం సీనియర్ నాయకుడు సీహెచ్ యాదయ్య, జోషి అశోక్ పంతులు, ఎండీ. ముబిన్‌ల ఆధ్వర్యంలో రోడ్డు వెండి ఉన్న వారందరిని కలిసి సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా చందాలు వసూలు చేసి బుధవారం రోడ్డుకిరువైపులా మట్టిపోయించారు.

ఆమనగల్లు : పట్టుదల, ఆత్మస్థైర్యం విజయానికి సోపానమని మాస్టర్స్ డిగ్రీ కళాశాల చైర్మన్ చుక్కా అల్లాజీ గౌడ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం స్థానిక భవాని గార్డెన్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ చందు, అధ్యాపకులు నాగరాజు, శివలింగం, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : డీసీసీ అధ్యక్ష పదవికి బుధవారం కడ్తాల మండలం గొర్లకుంట తండాకు చెందిన గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు హన్మనాయక్ దరఖాస్తు చేసుకున్నారు. టీయుఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి హన్మనాయక్ దరఖాస్తును అందజేశారు. ఏళ్లకాలంగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరినట్లు హన్మనాయక్ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

నక్షబాటను కాపాడాలి

నందిగామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకగూడ నుంచి జహంగీర్‌పీర్ దర్గా వరకు ఉన్న నక్షబాటను కాపాడాలంటూ బుధవారం మేకగూడ గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. పలువురు రైతులతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నక్షబాలను కబ్జా చేశారని, అటువైపుగా వెళ్లే ప్రజలు నక్షబాట కబ్జా కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నక్షబాటను సర్వే చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి

శంకర్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సేవలు మరువలేనివని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యాగౌడ్ తెలిపారు. పదవీ విరమణ పొందిన సంకేపల్లి పంచాయతీ కార్యదర్శి నరహరి, చేవెళ్లకు బదిలీపై వెళ్లిన ఏపీఎం భీమయ్యలను బుధవారం ఆయన పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఎంపీవో గిరిరాజ్, పీఆర్ ఏఈ నందకిషోర్, హౌసింగ్ ఏఈ లావణ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్‌రావు, ఏపీవో నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలందించడానికి మంజూరు చేస్తున్న సీఎంరిలీఫ్ ఫండు చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని నేదునూరు మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బుధవారం ఆయన అందించారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చొరవతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు.